ఈ-పంట.. కొత్త తంటా..!

- మారిన నిబంధనలతో వీఏఏల అవస్థలు
- నియోజకవర్గంలో 66 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటల సాగు
- 51,147 ఎకరాల్లో నమోదు పూర్తి
- ఈ నెల 30 వరకు గడువు
- ప్రభుత్వ పథకాలకు తప్పనిసరి
- ఆందోళన చెందుతున్న రైతులు


ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి (ఫైల్)

పెదపూడి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలపైనే అవుతోంది. రైతులకు అన్ని విధాలా ఉపయోగకరమైన పంట (ఈ-పంట) నమోదు మాత్రం అనుకున్నట్టు సాగడం లేదు. అనపర్తి నియోజకవర్గంలో ఈ నెల 23 నాటికి 51,147 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతుండగా, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో వీఏఏలపై ఒత్తిడి చేస్తున్నారు. వీఏఏలకు పని ఒత్తిడి, కొత్తవారు కావడం, ఎరువుల పంపిణీతో పాటు, కొన్ని నిబంధనలు మార్చడంతో అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. రైతుల మేలు కోసం గత ప్రభుత్వం ఈ-పంట నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేసింది.

నియోజకవర్గంలో ఇలా..

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 66 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగవుతున్నాయి. సుమారు 51,147 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయింది. ప్రధానంగా వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలు అనేకం ఉన్నాయి. వీటన్నింటినీ ఈ నెల 30లోగా ఈ-పంట నమోదు ప్రక్రియలో ఆన్‌లైన్ చేయాలి. ఇంకా వారం రోజులు కూడా లేదు. ఈలోగా పూర్తి చేయాలని అధికారులు కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు. సకాలంలో పంట నమోదు జరుగుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంట నమోదు సక్రమంగా కాకపోతే పండిన ధాన్యం విక్రయాలకు ఇబ్బందులు తప్పవు. ఎరువులు సక్రమంగా ఇవ్వకపోగా, ధాన్యం విక్రయానికి ఇబ్బంది కలిగితే మొత్తం నాశనమవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మారిన నిబంధనలతో అవస్థలు

గత ఖరీఫ్ సీజన్‌తో పోల్చితే ఈ-పంట నమోదులో ఈ ఏడాది కొన్ని నిబంధనలను ప్రభుత్వం మార్చింది. గతంలో 200 మీటర్ల దూరం నుంచి ఈ-పంట నమోదుకు అవకాశం ఉండేది. ఇప్పుడు దీనిని 20 మీటర్లకు కుదించారు. విధిగా వీఏఏలు ప్రతి కమతం వద్దకు వెళ్లి నమోదు చేయాల్సి వస్తోంది. 25 సెంట్ల లోపు ఈ-పంట నమోదు చేసేందుకు కమతం వద్దకు వెళ్లకపోయినా ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే అయిపోయేది. ఫొటో అప్లోడ్ తప్పనిసరిగా ఉండేది కాదు. ఇప్పుడు ఈ ఆప్షన్‌ను తొలగించారు. మరోవైపు యూరియా పంపిణీలో వీఏఏలు బిజీగా ఉండటంతో ఈ-పంట అనుకున్నంత ముందుకు సాగడం లేదు.

ఈ-క్రాప్ నమోదు వివరాలు

మండలం	మొత్తం విస్తీర్ణం (ఎకరాల్లో)	నమోదు పూర్తయిన విస్తీర్ణం (ఎకరాల్లో)
అనపర్తి	8,933	7,208
బిక్కవోలు	17,459	14,626
పెదపూడి	18,150	11,797
రంగంపేట	21,458	17,516
మొత్తం	66,000	51,147

ప్రయోజనాలు

ప్రతి రైతూ ఈ-పంట నమోదును చేయించాలి. ఇన్స్యూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల విక్రయానికి, అన్నదాత సుఖీభవ పథకానికి ఈ-పంట నమోదు తప్పనిసరి. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలన్నా పంట నమోదు చేయించాలి.

నమోదు కాకపోతే రైతులకు నష్టం



ఈ-పంట సజావుగా జరగకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాల మాటెలా ఉన్నా.. పండిన ధాన్యం విక్రయాలకు ఈ-పంట నమోదు పూర్తి కావాల్సిందే. ఈ-పంట నమోదు కాకపోతే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

– మార్ని వెంకట్రావు, రైతు, పెదపూడి

త్వరితగతిన పూర్తి చేయాలి



ఈ-పంట నమోదు ప్రక్రియను ఈ నెల 30 నాటికి పూర్తిచేయాలి. వీఏఏలు బాధ్యతగా ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి. తమ పరిధిలోని అన్ని పంటలనూ నమోదు చేయాలి. మారిన నిబంధనలు గమనించి వీఏఏలు చర్యలు వేగవంతం చేయాలి.

– ఎస్.సత్యప్రసాద్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

రాజానగరం: మహిళలు ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ వహించాలని పాలచర్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బెనిడెక్ట్ విజ్ఞప్తి చేశారు. రఘునాథపురంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య వైద్య శిబిరం మంగళవారం జరిగింది. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వైద్య పరీక్షలతో పాటు, కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేశారు.

ఆరోగ్యంతోనే బలమైన కుటుంబం

బిక్కవోలు: ఆరోగ్యకరమైన మహిళలతోనే బలమైన కుటుంబాలు ఆవిర్భవిస్తాయని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి అన్నారు. పందలపాక సచివాలయం-1 వద్ద మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ సబ్బారపు పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ రంగంపేట ప్రాజెక్టు సీడీపీవో కె.కృష్ణవేణి అన్నారు. బలభద్రపురంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పదార్థాలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. అలాగే సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. సర్పంచ్ బుంగా రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.పద్మ, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. కోటపాడులో సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 305 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. మర్రిపూడిలో సింగంపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో 233 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అనపర్తి విద్యార్థుల ఎంపిక


కె.శ్రీనివాసకుమార్


కె.రాజు


నల్లమిల్లి దొర వెంకటకృష్ణారెడ్డి


డి.సతీష్

అనపర్తి: పెదపూడి మండలం జి.మామిడాడ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 ఆటల పోటీలలో స్థానిక ఎంఎన్ఆర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో నల్లమిల్లి దొర వెంకటకృష్ణారెడ్డి, కె.రాజు ప్రతిభ చూపగా, వాలీబాల్‌లో కె.శ్రీనివాస్‌కుమార్ అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

వాలీబాల్‌కు కొత్తూరు విద్యార్థి

అనపర్తి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ కళాశాల విద్యార్థి డి.సతీష్ ఎంపికయ్యాడు. కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల రాజు మంగళవారం విలేకరులతో వివరాలు తెలిపారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో జరిగిన అండర్-19 విభాగం వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబర్చి సతీష్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు.

ఆర్థిక సమతుల్యత సాధనకే పీ4

సీతానగరం: పేద కుటుంబాలకు సాయం అందించడం ద్వారా ఆర్థిక సమతుల్యతను సాధించడమే పీ4 ముఖ్యోద్దేశమని ట్రైనర్లు శశికళ, ఫణి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోలకు పీ4పై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి పర్యవేక్షించారు. పేదరికంలో దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి, వారిని సంపన్న కుటుంబాలు దత్తత తీసుకుని, ఆర్థిక, విద్య, వైద్య, ఉపాధి సాయం అందించేందుకు ప్రోత్సహించడమే పథకం ఉద్దేశమన్నారు. మండలంలో సుమారు 3 వేల బంగారు కుటుంబాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలు

కోరుకొండ: మామిడి, జీడిమామిడిలో యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యాన శాఖ మండలాధికారి రినీ అన్నారు. కణుపూరులో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, చెట్ల కొమ్మల కత్తిరింపు, ఎరువులు అందించడం, పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం ద్వారా కలుపు నివారణ తదితర అంశాలను వివరించారు. ఎరువులు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సేంద్రియ సాగులో భాగంగా వేపనూనె పిచికారీ చేయడం ద్వారా పురుగులు, తెగుళ్ల నివారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే కలవచర్ల విశ్రాంత శాస్త్రవేత్త ఈ.విజయప్రసాద్, టెక్నికల్ అధికారి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా.. పాహిమాం..

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు
- గాయత్రీ మాతగా సంపర విజయదుర్గ అమ్మవారు


సంపరలో గాయత్రీదేవి అవతారంలో విజయదుర్గ అమ్మవారు


తొస్సిపూడిలో గాయత్రీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ


చంద్రేడులో గాయత్రీదేవిగా..


రంగంపేటలో అమ్మవారు

పెదపూడి: మండలంలోని వివిధ గ్రామాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. జి.మామిడాడ, పెదపూడి, సంపర, పుట్టకొండ, గండ్రేడు తదితర గ్రామాల్లో అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. సంపర విజయదుర్గ అమ్మవారి ఆలయంలో పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు అమ్మవారికి పంచ హారతులతో విశేష పూజలు చేశారు.

గాయత్రీదేవిగా అమ్మవారి అలంకరణ

బిక్కవోలు: గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవిని గాయత్రీదేవిగా ప్రత్యేకాలంకరణ చేశారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అర్చకులు గరిమెళ్ల సత్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. కొమరిపాలెం, బలభద్రపురం, తొస్సిపూడి గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

భవానీలకు భిక్ష, పడి

కొమరిపాలెంలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయం వద్ద భవానీలకు పడి, భిక్ష ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు జామి విశ్వేశ్వరరావు తెలిపారు. దేవీ నవరాత్రుల అన్ని రోజులూ గ్రామంలోని భవానీలకే కాకుండా, రాయవరం, పందలపాక, తొస్సిపూడి, కొప్పవరం తదితర గ్రామాల వారికి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

త్రిశక్తి పీఠానికి వెల్లువెత్తిన భక్తులు

అనపర్తి: నియోజకవర్గ కేంద్రమైన అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఓం శక్తి సత్సంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రిశక్తి పీఠాన్ని సందర్శించేందుకు మంగళవారం భక్తులు పోటెత్తారు. గాయత్రీదేవిగా అలంకృతులైన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులతో పాటు, ప్రముఖులు భారీగా విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్రి త్రినాథ్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు చింతా గోపాలకృష్ణారెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యదర్శి మల్లిడి రామకృష్ణారెడ్డి, వర్తక సంఘం అధ్యక్షులు కొవ్వూరి వెంకటరామారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు లెఫ్ట్ శ్రీను, సత్తి పోతారెడ్డి తదితరులు ఉన్నారు, మేడపాటి వెంకటరమణారెడ్డి, సత్తి రామారెడ్డి గురు భవానీలు అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు రక్షా కట్టి ఆశీర్వదించారు. దుప్పలపూడిలో ముసలమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

దేదీప్య మానంగా..

రంగంపేట: శరన్నవరాత్ర ఉత్సవాలు రెండో రోజు మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవీ సెంటర్‌లోని ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారికి అర్చకుడు నాగేంద్రశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలతో సుందరంగా అలంకరించారు. చంద్రేడులో కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకాల అనంతరం వెండి, బంగారు నగలతో అలంకరించారు. దొంతమూరు మెయిన్ రోడ్డులోని విజయదుర్గాదేవి నవరాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈలకొలనులోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం, వడిశలేరు తదితర గ్రామాల్లోని అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఘనంగా ఉత్సవాలు

కోరుకొండ: కాపవరంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త నీరుకొండ వర్ధన విజయ భాస్కరరావు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కోరుకొండ సీఐ సత్యకిషోర్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఊరేగింపులో డీజేలకు అనుమతులు లేవని, ప్రశాంతగా ఉత్సవాలు నిర్వహించాలని సీఐ సూచించారు. ఈ నెల 29న ఆలయంలో సామూహిక సహస్ర కుంకుమార్చన జరుగుతుంది. అక్టోబర్ ఐదున అమ్మవారి ఊరేగింపు, ఎనిమిదిన అన్న సమారాధన ఉంటాయి. దసరా సందర్భంగా బూరుగుపూడి, కోటికేశవరం, గాడాల, కాపవరం, కోరుకొండ తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.


కాపవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న సీఐ సత్యకిషోర్ దంపతులు


దుప్పలపూడిలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

క్లుప్తంగా

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి; బ్రాహ్మణ సేవా ట్రస్టు ద్వారా ప్రతి ఏటా అందించే ఉపకార వేతనాలకు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ దంతుర్తి సత్యప్రసాద్ మంగళవారం తెలిపారు. మెరిట్ కలిగి, ఆర్థికంగా వెనుకబడిన పూర్వ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన బ్రాహ్మణ విద్యార్థులు మాత్రమే అర్హులని చెప్పారు. వివరాలకు 98495 92523 నంబరులో సంప్రదించాలన్నారు.

పరిజ్ఞానం పెంపొందించుకుంటే మంచి భవిష్యత్తు


ప్రొఫెసర్ కిరణ్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

రాజానగరం: రోజురోజుకూ అభివృద్ధి సాధిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే యువ ఇంజినీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎన్ఐటీ ఏపీ అసోసియేట్ ప్రొఫెసర్ జి.కిరణ్‌కుమార్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో డెవలప్‌మెంట్ ఆఫ్ ఏఐ అసిస్టెడ్ స్మార్ట్ రేడియో వైర్‌లెస్ 5జీ అండ్ బియాండ్ నెట్‌వర్క్స్ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ప్రాథమిక రేడియో సాంకేతికత నుంచి నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత పరిజ్ఞానం వరకు విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ పి.వెంకటరత్నం, కో-కన్వీనర్లు బి.సుధాకిరణ్, ఎ.విజయదుర్గ, బి.కృష్ణ, ఎస్.సంతోషి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.50 వేల విరాళం


కొంకుదురులో విరాళం అందుకుంటున్న గురుస్వాములు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి ఆలయానికి రూ.50 వేల విరాళం అందినట్టు గురుస్వాములు వెలగల చెల్లారెడ్డి, కర్రి సత్యనారాయణ రెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన కర్రి సత్తిబాబు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కర్రి సూర్రెడ్డి (పవన్) విరాళం అందించారన్నారు.

దేశాభివృద్ధిలో యువతది కీలక పాత్ర

ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి సుధాకర్


డాక్టర్ సుధాకర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

రాజానగరం: యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశభక్తి, పౌర స్పృహ, సత్ప్రవర్తన, నాయకత్వ లక్షణాలు వంటి ఉత్తమ గుణాలను అలవర్చుకోవడానికి ఎన్ఎస్ఎస్ అద్భుత వేదికవుతుందన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజ సేవలో పాల్గొని, ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణంరాజు, పీఓ డాక్టర్ వాణిమాధవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సమైక్యత శిబిరం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో వచ్చే నెల ఐదు వరకు జరిగే ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ శిబిరానికి నలుగురు సైనికాధికారులు, 12 మంది ఎన్‌సీసీ అధికారులు, 25 మంది డిఫెన్స్ పర్సన్స్‌తో పాటు, 300 మంది ఎన్‌సీసీ కేడెట్లు హాజరు కానున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

8 మంది జూదరుల అరెస్ట్

సీతానగరం: రఘుదేవపురం శివారున పేకాట శిబిరంపై దాడి చేసి, ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.16,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా రఘుదేవపురానికి చెందిన వారేనన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

నేడు ఉచిత పశు వైద్య శిబిరం

అనపర్తి: జిల్లా పశు సంవర్ధక శాఖ, ప్రాంతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తాధ్వర్యంలో బుధవారం పీరా రామచంద్రపురం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పశు వైద్యులు డాక్టర్ టి.రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో పశువులకు చూడి పరీక్షలు, సాధారణ గర్భకోశ వ్యాధులకు, ఎదకు రాని పశువులకు, చూడి నిలబడేందుకు ఉచిత చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే మంద గుది ఉన్న పశువులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని, లేగదూడలకు ఏలికపాముల మందులు, ఉచిత రక్త పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. మండపేట, కాకినాడ నుంచి పశు వైద్య శస్త్రచికిత్స నిపుణులు హాజరవుతారన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ


శిక్షణకు హాజరైన సచివాలయ సిబ్బంది

బిక్కవోలు: పీ4 సర్వేపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎలా సర్వే చేయాలి, ఎలాంటి విషయాలు యాప్‌లో పొందుపరచాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి నాగేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


బహుమతి సాధించిన సేవ్ గర్ల్ చైల్డ్ చిత్రం

పెయింటింగ్‌లో నిక్షిత ప్రతిభ


నిక్షిత వీరవెంకట దుర్గ

పెదపూడి: జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో తమ పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్.నిక్షిత వీరవెంకట దుర్గ ద్వితీయ స్థానం సాధించినట్టు స్థానిక గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ-1 కె.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, అమ్మాయిలను కాపాడుకుందాం (సేవ్ గర్ల్ చైల్డ్) అనే ఇతివృత్తంతో జిల్లా స్థాయిలో పెయింటింగ్ పోటీలు ఈ నెల 20న కాకినాడ శాలిపేట ఉన్నత పాఠశాలలో జరిగాయన్నారు. తమ విద్యార్థి నిక్షిత ద్వితీయ స్థానం సాధించి, రూ.3 వేల నగదు పారితోషికాన్ని గెలుచుకుందన్నారు. విద్యార్థినిని, గైడ్ టీచర్ రాజ్యలక్ష్మిని ఆయన అభినందించారు. వచ్చే నెల 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లా ముఖ్య అధికారులు ఆమెకు బహుమతి అందజేస్తారని తెలిపారు.